కథా నిలయం
1489
శ్రీకాకుళం

# మోసపోయిన బతుకులు

క్రాలేజీ నుంచి రూముకు వొచ్చే సరికి దాదాపు అయిదు గంటలయింది. ఇన్నూ రెన్నూ ఏజెంటు గారి కొబ్బరి చెట్లలోంచి వొచ్చే సాయంత్రపు చల్లని ఎండ రూము ముందు పడుతోంది. కూనిరాగం తీసుకుంటూ రూము తాళంతీసి, కిటికీ కేసి ఆశగా చూశాను. ఎందుకంటే పోస్టుమాన్ రోజూ ఉత్తరాల్ని ఆ కిటికీలోంచే వేస్తాడు. ఉత్తరాల కోసం ఎదురు చూడటంలో ఎంత సరదా ఉంది?

ఒక పోస్టు కార్డూ, ఒక మ్యాగజీన్ బుక్ పోస్టూ, కిటికీ ప్రక్కగా పడి ఉన్నాయి. ఆ ఉత్తరం వాల్తేరు నుంచి ఒక స్నేహితుడు వ్రాసింది. బుక్ పోస్టు కవరు చించాను-మ్యాగజీన్‌పడ్డ నా కథను చూసుకుందామనే అమితమైన ఆదుర్దాతో కూడుకున్న అపరిమితమైన ఆనందంతో. ఇన్ని సంవత్సరాలుగా, ఇన్ని పత్రికల్లో—యిన్ని కథలు వ్రాసినప్పటికీ, ఏమిటో ప్రతిసారీ—కథ అచ్చుఅయినప్పుడల్లా ప్రారంభ రచయిత లాగా ఆదుర్దాగా, ఉత్సాహంగా, పేరు ఒక్కసారి పెరిగిపోయినట్టుగా, పత్రికల్లో పేరు చూసే వరకూ మనస్సు ఆవేగపడటం తప్పదు.

చిత్రం!

బుక్ పోస్టు కవరు చించేప్పటికి, ఆ కవరులోంచి—ఒక మామూలు బేడ కవరు క్రింద పడింది. దానిమీద అడ్రసు :

పి. రాజ్యలక్ష్మి,
కేరాఫ్. ఆర్. నారాయణమూర్తి.
రామానాయుడి పేట,
బందరు.'

అని వుంది.

పోస్టాఫీసు వాళ్ళ పొరపాటువల్ల ఆ పని జరిగి వుంటుందనుకున్నాను. ఆ కవరు పైన ముద్ర చూశాను. విజయవాడ బకింగ్‌హామ్ పేట ముద్ర ఉంది.

ఆ కవర్ను చూస్తున్నంత సేపూ నాలో అనేక రకములైన ఆలోచనలు కదిలినయ్. ఆ కవరు వ్రాసిన వారెవ్వరు? ఆ కవరు వ్రాసిన వారు పురుషుడా? స్త్రీయా? పురుషుడైతే, భర్తా, తమ్ముడా, అన్నా, ప్రియుడా మరొక హితుడా? ఆ కవరులో ఏం వ్రాసి ఉంది? ఆ కవరు పట్టుకొని అటూ-ఇటూ నాలుగైదు సార్లు త్రిప్పాను! కాని మూసిఉన్న కవర్లో ఏం రాసి ఉందో, ఎట్లా చెప్పటం?

ఆ కవరులో ఏం వుంటే తన కేం?

తన కెందుకు యింత ఇంటరెస్టు!

కాని నాలో ఎందుకో ఉల్లాసం గట్టు త్రెంచుకొంటోంది. అదే మగవాడి పేరుతో ఉన్నట్లయితే—నా మనస్సు ఇంత ఆరాటపడి వుండేది కాదేమో! స్త్రీ పేరుతో ఉండటం వల్లనే ఇంత ఇంటరెస్టూను. ఆ కవరులో ఏం ఉందో చూడాలనే కాంక్ష నాలో ఎక్కువైంది. చించి చూద్దా మనుకున్నాను. కాని తీరా చించబోయేప్పుడు హృదయంమీద చిన్న అడుగు పడింది.

ఆ కవరు చించడం ఏం సబబు?

రెండో కంటి వాడికి తెలీని ఏ రహస్యాలు అందులో నిక్షిప్త పరచబడ్డాయో!-తను చూడాలని ఉత్సాహపడట మేమిటి? అది ఏం

బాగుంటుంది? చదువుకున్న వాడూ, విచక్షణ జ్ఞానం కలవాడూ, సంఘంలోని మంచిచెడుగుల్నీ, మానవహృదయాల్లోని ఎత్తు పల్లాల్ని అవగాహన చేసుకున్నవాడూ, రచనల ద్వారా లోకానికీ ఏదో నామ మాత్రంగా ఉపయోగపడుతున్న వాడూ అయిన నేను, అతి సామాన్యునిలా, స్త్రీ హృదయం ఏమీ తెలియని వాడులా, ఆ కవరు చించటమేమిటి? అది ఏం సభ్యత?

ఆలోచించాను.

రూములో అటూ ఇటూ లెక్కలేనన్ని సార్లు పచార్లు చేశాను, ఆలోచిస్తూ.

ఏమిటి? ఆ కవరు చించటమా? లేక రేపు పోస్టుమాన్‌కు అందివ్వడమా? ఏది సముచితం? అనుసరించవలసిన మార్గమేమిటి?

ఆ కవరు చేరవలసిన తేదీ ఇవాళేనేమో! ఒక రోజు ఆలస్యంగా చేరడం వలన-జీవితగతులే మారతాయేమో! వ్యక్తుల చరిత్రల్లోనే మార్పు వొస్తుందేమో! ఆ కవరులో అంత ముఖ్యమైన విషయమే గనుక వుంటే-ఎట్లానైనా ఆ కవరు ఈ సాయంత్రమే ఆమెకు అందజేయడం ఉత్తమం. కాని ఆ కవర్లో వ్రాసి ఉన్న విషయం ముఖ్యమైనదో అముఖ్యమైనదో తెలుసుకొనేది ఎట్లా? కనుక కవరు చించడం ప్రధానం. ఆ కవర్లో ఉన్న విషయం అంత ప్రధానమైనది కాకపోతే, ఏదో మొగుడు క్షేమంకోరుతూ వ్రాసిన లేఖో, చెల్లెలు పురుడు సంగతి వ్రాసిన లేఖో, మేనమామ పిల్లల్ని క్షేమాన్ని తెలుపమని వ్రాసిన లేఖో-అయితే రేపు నింపాదిగా పోస్టుమాన్ చేతికే ఇచ్చి పంపి వేయొచ్చు. మధ్యన ఆమె అడ్రసు కనుక్కొని-సందులూ గొందులూ తిరిగి కవర్ను అందజేసే ఆదాయంలేని శ్రమంతా ఎందుకు? కాబట్టి కవరు చించడమే కర్తవ్యంగా తేల్చుకున్న వాడినై, నెమ్మదిగా, ఎట్టి అనుమానానికీ తావును కల్పించకుండా, కవర్ను చించాను.

ఆ కవరు లోపల లేఖ ఇల్లా ఉంది.

విజయవాడ,

.............

ప్రియమైన రాజ్యలక్ష్మికి,

నీ ఉత్తరం అందింది. ఆ ఉత్తరంలో నువ్వు వెళ్ల గ్రక్కిన వేదనంతా అర్థమైంది. 'ఇప్పటి నా బ్రతుక్కి ఆత్మహత్య కంటె మరో మార్గం లేదు. నన్ను ఆత్మహత్యా మహా పాపాన్నుంచి తప్పించాలంటే-నువ్వు నన్ను పెళ్లాడటమే!' అని వ్రాశావు. నిన్ను ఆ స్థితికి తెచ్చింది నేనే రాజీ! నీ భర్త చనిపోయాడు. కాని నీ అందం చచ్చిపోలేదు. నీ అందానికి జీవితంలో తగిన విలువల్ని చేకూర్చాలని నిన్ను చూసిన-మొదట్లోనే అనుకున్నాను. అందుచేతనే నీతో స్నేహం చేయటానికి విశ్వప్రయత్నాలూ చేశాను. చివరకు కృతకృత్యుడ్ని అయ్యాను. మన స్నేహం ప్రవిమలమైన ప్రేమగా మారటానికి ఎక్కువకాలం పట్టలేదు.

భర్త చనిపోవడంతోనే—జీవితం ఆకులు రాల్చుకున్న చెట్టులాగ అయిందని నువ్వు బాధపడ్డావు. ఆ చెట్టుకు మళ్లీ ఆకులు చిగురించే కాలం వొస్తుందా? అని భ్రమపడ్డావు. ఆ కాలాన్ని కలిగించే బాధ్యతను నేను పైన వేసుకున్నట్టు నీకు తెలియపర్చగానే—నువ్వు ఎంతగా సంతోషించావు?

నీ కళ్ళు ఎంత 'రిలీఫ్‌ను' పొందాయి?

నీ పెదాలు ఎంత మార్దవాన్ని రూపొందించుకున్నాయి?

నీ వొళ్లు ఎంతగా మొగ్గలు తొడిగింది?

'రాజీ! నిన్ను తప్పకుండా వివాహం చేసుకుంటాను. జీవితంలో మన మిద్దరం భాగస్వాములం. నువ్వు 'విధవ' వయినా వన్న ఆలోచన లేదు. నువ్వు 'కట్నం' తీసుకు రాకపోయినా నాకు బాధలేదు. నీ హృదయం వెనుక మంచితనం, నీ నేత్రాల వెనుక సౌకుమార్యం, నీ పెదాల పైని పేశలత్వం, నీ కంఠం క్రింది గుండ్రదనం, నీ వక్షంపైని నునుపూ—ఇవీ నేను నీనుంచి వాంఛించేది!' అని నేను అన్నట్టు జ్ఞాపకం చేశావు! అవును. ఆ వాక్యాలు నాకూ జ్ఞాపకం ఉన్నాయి.

'మన రహస్య కలయికవల్ల నాకు నెల తప్పింది. ఇంత దారుణం జరిగాక నన్ను అన్యాయం చేయకండి! నా బ్రతుకు పైన నల్లని ముసుగు కప్పకండి! ఈ సంఘంలో గర్భం దాల్చిన విధవకు గల విలువా, గౌరవం

మీకు తెలియనివి కావు! ఆమెపట్ల లోకం యొక్క మూడో కన్ను తీవ్రతకూడా మీకు తెలియనిదికాదు. నా ప్రశ్నకు సమాధాన మివ్వండి!

నన్ను భార్యగా స్వీకరిస్తారా?

ఒక అభాగ్యురాలి ఆత్మహత్యకు కారకులౌతారా?

మీరు చదువుకున్నవారు, స్త్రీహృదయాన్ని అర్థం చేసుకున్న వారు, స్త్రీ నుంచి దివ్యమైన ఆనందాన్ని పొందిన వారు, స్త్రీ జీవితంలో కాంతికి హామీగా వుంటానని వాగ్దానం చేసిన వారు,-ఆ స్త్రీ బ్రతుకు బజారు కెక్కుతూంటే, ఆ స్త్రీ జీవితం అందరి నోళ్ళలోనూ నానుతూంటే, ఆ స్త్రీ వర్తమాన భవిష్యత్తులకు కారకులైన మీరు-ఆ స్త్రీని రక్షించలేరా? వాగ్దానాన్ని నిలబెట్టుకోలేరా?

'చెప్పండి-నా బ్రతుకు ఏం కాను'? అని వ్రాశావు.

నీ వేదన నా హృదయాన్ని కలచి వేసింది. నీతో గడిపిన రాత్రుళ్లూ నీతో మాట్లాడిన సాయంత్రాలూ, నీ వంక చూస్తూ గడిపిన పగలూ, నీ కోసం కాలేజీ మానివేసిన దినాలూ-అన్నీ జ్ఞాపకం తెచ్చుకున్నాను.

నీకు అన్యాయం చేయను రాజ్యలక్ష్మీ!

నువ్వు నా భార్యవు.

నాకుటుంబం, నేను బ్రతుకుతున్న తీరూ, నీకు పూర్తిగా తెలియదు రాజ్యలక్ష్మీ. మా వాళ్లు కట్నానికి ఆశపడి, నాచదువు క్రింద ఖర్చుపెట్టిన మొత్తమంతా కట్నంలోనే గుంజాలనే తలంపుతో, ఒక సంబంధం చేసుకోక పోతే బావిలో దూకుతానని తల్లి బెదిరిస్తూంది. కరెంటు తీగ పట్టుకుంటానని తండ్రి బెదిరిస్తున్నాడు. ఏం చేయను?

నీ ఉత్తరం అందటంతో నాకు బోధపడింది ఏం చేయటమో! నీ బ్రతుకుమీద నల్ల ముసుగు కప్పటం నాకు సాధ్యంకాదు, రాజలక్ష్మీ! ఒక స్త్రీ నా వల్ల దగాపడి, ప్రపంచంలో బ్రతికే ఆస్కారాన్ని కోల్పోయి, చివరకు ఆత్మహత్యకు తల పడటాన్ని—నేను ఎట్లా సహిస్తాను? నేను నిన్ను వివాహ మాడతాను.

తల్లి బావిలో దూకినా-

తండ్రి కరెంటు తీగ పట్టుకున్నా-

బంధువులు ముక్కుమీద వ్రేళ్ళు వేసుకున్నా-

లోకం కళ్ళు విప్పి, నోరు తెరిచినా-

నేను నిన్ను తప్పక వివాహ మాడతాను రాజ్యలక్ష్మీ!

కాని యీ పరిస్థితుల్లో మన వివాహం అంత సులభం కాదు. మనం యీ నరరూప రాక్షసుల బారి నుంచి బయటపడాలి. ఆ తరువాత నే మన కలలు నిజమౌతాయి.

నువ్వు యీ ఉత్తరం అందిన రోజు రాత్రే విజయవాడ స్టేషనుకు ఎట్లాగైనా సరే రావాల్సింది. నేను అక్కడ కలుసుకుంటాను. మన ఇద్దరము అక్కణ్ణుంచి ఎటైనా వెళ్లి, పెళ్ళి చేసుకుందాం. నేను అంతా ఆలోచించి నిర్ణయించాను.

నువ్వు మాత్రం తప్పకుండా రావాల్సింది.

నేను ఎదురు చూస్తూ వుంటాను.

ఈ అవకాశాన్ని, నువ్వు, ఇంట్లోవారికి భయపడి, జారవిడుచుకుంటే —ఇక ముందు నువ్వు నన్ను కలుసుకోవడం అసాధ్యం.

నీ, ప్రసాదరావు.

ఆ ఉత్తరం చివరి వరకూ చదివేప్పటికి నా శరీరం జావలాగ అయింది స్వేదంతో.

కర్తవ్యం ఆలోచించాను.

రూము ముందుపడే ఎండ జరిగి పోయింది. టైంచూశాను. అయిదూ ఇరవై అయింది. కవరు ఆమెకు వెంటనే అందచేయాలి! లేక పోతే ఆమె ఇవాళ ఇక్కణ్ణుంచి లేచి వెళ్లడం అసంభవం! లేచి వెళ్లక పోతే— ఉత్తరం చివరి భాగంలో వ్రాసినట్టు, జీవితంలో నే కలుసుకొనే అవకాశమే ఉండదేమో! ఆమె భవిష్యత్తుతో నేనెందుకు ఆటలాడాలి? ఆమెను హృదయేశుడ్నించి నేనెందుకు వేరు చేయాలి? ఆమె విధవ. ఈ సంఘం దృష్టిలో 'విధవ' అనే స్త్రీ, వంట చేసి పెట్టడానికి మినహా ఎందుకూ పనికిరాదు. కాని ఆమె మళ్లీ పునర్వివాహం చేసుకొని పునిస్త్రీ కాదల్చుకుంది. కాక తప్పదు. పైగా ఆమె నెల తప్పించుకున్న ఆడది.

ఏమిటో, ఒక్కొక్కప్పుడు యీ ఆడవాళ్ళ అభాగ్య చరిత్ర వింటూంటే తగని జాలి వేస్తూంటుంది. పురుషుల మాటలకు ఐస్‌క్రీం ఎండకు కరిగినట్టు కరిగిపోయి, బెలూన్‌లో గాలి కొట్టబడినట్టుగా వుబ్బిపోయి, తమ అందమైన శరీరాలమీద, గులాబీ పువ్వు రేకుల కంటె మెత్తగావుండే తమ శరీరాలమీద, హక్కును జారవిడుచుకుంటారు; ఎదుటవారి ఆనందానికి కల్పతరువులుగా తయారవుతారు. పాపం! తరువాత కానీ తెలిసిరాదు—తనని 'దిగి వచ్చిన దేవకన్యవు!' అని పొగిడిన ఆ నాలుకకు రెండు వైపులా పదును ఉన్నదనీ, 'నిన్ను భార్యగా చేసుకొని, నీ జీవితంలో పువ్వుల వర్షం కురిపిస్తాను' అని చేసిన వాగ్దానానికి ఆచరణలో ఏమీ విలువ లేదనీ, తన పెదాలను ముద్దు పెట్టుకోవటంలో అమృతాన్ని చవిచూచిన అతని పెదాలలో, కేవలం విషమేవున్నదనీ, తన శరీరంమీద ఏర్పరచుకొన్న అధికారం, అభిమానం, కేవలం తాత్కాలికమేననీ! పైగా అట్లా గాడి తప్పిన ఆడవాళ్ళకు ప్రకృతి సహకరించదు. వాళ్ళు ఎక్కడ తప్పటడుగు వేశారో లోకానికి ఎత్తి చూపుతుంది. వాళ్ళ అవినీతి ఏమిటో—సంఘానికి చాటుతుంది! పాపం! రాజ్యలక్ష్మి గతికూడా అంతే! ఆమెకు నెల తప్పిందట! అయినా ఆమె ప్రియుడు మోసగాడు కాదు. ఏమైనా ఆమె మగవాణ్ని మనస్ఫూర్తిగా నమ్మకుంది.

వెంటనే ఆ కవరు యధాతథంగా మడిచి, సాధ్యమైనంత వరకూ ఎట్టి అనుమానం కలక్కుండా ఉండేట్టు జాగ్రత్తపడి, రూముకు తాళం వేసి,—రామానాయుడి పేటకు బయలుదేరాను, ఆ కవరు ఆమెకు అంద చేసేందుకు.

రామానాయుడి పేట సెంటర్లో క్లాస్‌మేట్ కామేశ్వరరావు అగుపించాడు. వాణ్ని అడిగాను, ఆర్. నారాయణమూర్తి వుండేది ఎక్కడని. వాడు ముందుగా ప్రశ్నల వర్షం కురిపించి—చివరకు చెప్పాడు. రైలు స్టేషన్‌కు పోయే సందులో ఉంది, ఆ డాబా. ఆడాబా ముందుగా రెండు మూడు సార్లు పచార్లు చేశాను. ఎట్లా ఒంటరిగా ఆ డాబాలోకి జొరబడడం? ఆ డాబా వరండాలో ఇద్దరు అమ్మలక్కలు కూర్చుని లోకాభిరామాయణం మాట్లాడుకుంటున్నారు. రాజ్యలక్ష్మి ఆ ఇంట్లో ఎక్కడ ఏ మూల ఏ అంట్లు తోముతోందో, ఏ చెట్లకు నీళ్ళు పోస్తోందో! ఎట్లా ఆమెకు కవర్ను అంద జేయటం?

ఆ డాబాప్రక్క ఎలక్ట్రిక్ స్తంభం క్రింద నిలబడ్డాను—ఎవరి కోసమో నిరీక్షిస్తోన్నట్టు నటిస్తూ. రెండు నిమిషాలపాటు నిలువు కాళ్ళ శ్రమ అనుభవించిన తర్వాత నా కళ్ళ ముందు ఒక ఆశారేఖ అగుపించింది.

ఆ డాబాలోంచి ఒక అయిదేళ్ల పిల్లవాడు బయట పడ్డాడు. వాడ్ని లంకించుకున్నాను.

'మీది ఆ డాబాయేనా?'

'ఊఁ!' తల ఆడించాడు.

'అందులో రాజ్యలక్ష్మి అనే ఒక అమ్మాయి ఉండాలి. ఉన్నదా?'

ఆ పిల్లవాడు నా వంక ఎగాదిగా చూశాడు.

'ఎందుకూ?'

'ఏంలేదు. ఆమె ఉత్తరం పొరపాటున నా రూమ్‌లోకి వొచ్చి పడింది. ఆ ఉత్తరం ఆమెకు భద్రంగా అంద జేస్తావేమోనని.'

'ఊఁ!'

'ఇప్పుడు ఆమె ఏం చేస్తోంది?' అన్నాను.

'కిటికీలో ప్రూరికనే కూర్చుంది.'

'ఈ కవరు ఎవ్వరికీ ఇవ్వకుండా ఆమెకే ఇస్తావా?'

'ఆఁ!'

'ఆమె నీకు ఏమవుతుంది?'

'అక్క!'

'నువ్వు ఆమెకే యిస్తావని నాకు నమ్మక మేమిటి?'

'ఇస్తానుగా. మా అక్కయ్య ఎంతో మంచిది. నాకు కోవాబిళ్లలు కొనుక్కోవటానికి రోజూ ఒక అణా ఇస్తుంది'

నాకు ఇక వెంటనే నమ్మకం ఏర్పడి కవరు ఇచ్చాను. అంతటితో యీ కథలో నా పాత్ర అంతమవుతుందనీ, ప్రేమతో పరితపించే రెండు హృదయాల కలయికకు సహాయపడ్డాననీ, ఆనందించాను.

రెండు రోజుల తర్వాత కాబోలు ఆ పిల్లవాడు పట్టాభిమార్కెట్ సెంటర్లో నన్ను నిలబెట్టాడు.

'ఆ ఉత్తరంలో ఏముంది సార్! ఆ రాత్రే మా అక్క ఎటో పారిపోయింది!' అన్నాడు.

'మీ బావ దగ్గరకు వెళ్లిందోయ్!' అన్నాను ఛలోక్తిగా.

'మా బావా?—మా బావ ఏనాడో చచ్చిపోయాడుగా!' అన్నాడు అర్థం కాని అమాయకత్వంతో.

'కొత్త బావ—' అన్నాను నవ్వు ఆపుకోలేక. నాలో సంతోషం రెక్కలు విప్పుకొంది. రాజ్యలక్ష్మి లేచి పోవటం నాకెంతో ఆనందాన్ని చేకూర్చింది.

'కొత్త బావా? అంటే...'

నేను సైకిలెక్కి హుషారుగా తొక్కుకొంటూ వెళ్లాను. 'కొత్త బావ' అనే పదం వెనుక దాగి ఉన్న అర్థం కోసం ఇంకా ఆ పిల్లవాడు తంటాలు పడుతోనే ఉన్నట్టు, వంద గజాలు వెళ్లాక వెనుదిరిగి చూడగా నాకు గోచరించింది.

ఆ రాత్రంతా రాజ్యలక్ష్మి పేరు నా హృదయంలో నాట్యం చేస్తోనే ఉంది.

## 2

మనం నిత్యమూ ఎన్నెన్నో విచిత్రాలు చూస్తుంటాం! బజార్లలో సినిమా హాలుల్లో, రైల్వే స్టేషనుల్లో, బస్సు స్టాపుల్లో—ఎన్నో అందమైన కొత్త ముఖాల్ని చూస్తుంటాం! ప్రకృతి సౌందర్యాల్ని మనస్సులో అభినందించుకొనే హక్కు ప్రతి వ్యక్తికీ ఉంది. 'ఆ అమ్మాయి ముఖం చూడు, థర్మామీటర్‌లోని పాదరసంలాగ ఎంత కాంతితో ఉందో!' 'ఆ పిల్ల చూడు, తామర పువ్వులాగ ఎంత మనోహరంగా ఉందో!'

'ఆమె వొయ్యారం కలహంసికను జ్ఞాపకం తెస్తూంది'

'ఆమె నవ్వు తెరిపివెన్నెలను.........' 'ఆమె కళ్ళు... ఆమె పళ్ళు... ఆమె కులుకూ... తళుకూ...' అందమైన ఆడదాన్ని చూసినప్పుడల్లా యిట్లా మన మనసుల్లో వర్ణన చెలరేగడం కద్దు. కాని ఆ వర్ణన తాలూకు అనుభూతి మనలో గట్టిగా నిలవదు. వాళ్లెవ్వరూ మన

ఊహా సుందరులు కారు, ఆరాధ్య దేవతలూ కారు. వాళ్ళని మనం త్వరలోనే మరచి పోతాము.

అట్లాగే నేను రాజ్యలక్ష్మిని ఏ బజార్లో, ఏ బస్సుస్టాండులో, ఏ సినిమాహాళ్లో, ఏ రైల్వే స్టేషన్లో, ఏ ఊళ్ళోనో—చూసి ఉండొచ్చు. కాని ఆమె రూపు నాకు గుర్తు లేదు. అసలు ఆమెను నేను చూడలేదు.

ఎప్పటికైనా చూస్తానా?

ఆమె, ప్రసాదరావూ పెళ్ళి చేసికొని వుంటారు. వాళ్ళకో చక్కని కొడుకు కూడా కలిగి వుంటాడు.

ప్రసాదరావు చాల గొప్ప పనిచేశాడు. తనలోని సంస్కారాన్ని విజ్ఞానాన్ని దైనిక జీవితంలో అమల్లో పెట్టి—ఆదర్శ జీవి యైనాడు. ఒక స్త్రీని ప్రేమించాడు. ఆ స్త్రీ హృదయాన్ని చూరగొన్నాడు. మామూలు వ్యక్తిలాగ అతనూ కామానికి గురి యైనాడు. కాని అతను-తనని నమ్ముకొని, తనకి సర్వస్వాన్నీ అర్పించిన ఆడదాన్ని మోసం చేయలేదు. పెళ్ళి చేసుకున్నాడు. సంఘానికి భయపడ లేదు. తల్లి దండ్రులకు బెదర లేదు. బంధువులకు వెనుకాడ లేదు. అటువంటి సత్య సంధులూ, కార్యాదీక్షా పరులూ, సంస్కారులే సంఘానికి అవసరం! సంఘంలోని మార్పుకు వాళ్ళ ఆవస్యకత ఎంతైనా ఉంది-

ఇలా అనుకుంటూ వుంటాను అప్పు డప్పుడు. నేను బి. కామ్ బందరు హిందూ కాలేజీలో పూర్తిచేసి, ఖరగ్‌పూర్‌లో రైల్వేలో పనిచేస్తూ వున్నాను. అక్కడ మన తెలుగువాళ్లు చాలామంది ఉద్యోగాల్లో ఉన్నారు.

నాకు గల స్నేహితుల్లో దాసు, కృష్ణమూర్తి ముఖ్యులు. వాళ్లు ఇద్దరే నా రూముకు తరుచూ వస్తూ వుంటారు. మేము ముగ్గురం ఎక్కువ జోస్తీగా తిరుగుతూ వుంటాము.

ఒక రోజు సాయంత్రం కృష్ణమూర్తి నాకు ఒక కొత్త వ్యక్తితో పరిచయం చేశాడు. అతనిపేరు ఎల్. ప్రసాదరావుట. ఉద్యోగంలో చేరి మూడు మాసాలైందిట. మన ప్రాంతం వాడేనట. ప్రసాదరావు పేరు వినగానే నాకు రాజ్యలక్ష్మి ప్రియుడిపేరు స్ఫురణకు వొచ్చింది. అతనే ఇతనైతే బాగుండు ననుకున్నాను.

త్వరలో ప్రసాదరావు మా బృందంలో ఒకడైనాడు. ఒకరోజు ప్రసాదరావు మా ముగ్గుర్నీ తన ఇంటికి తీసి కెళ్లాడు. అతను కొత్తగా పెళ్ళి చేసుకున్నాడట. కొత్త కాపురమట. తన శ్రీమతిని మా ముగ్గురికీ పరిచయాం చేశాడు. ఆ పిల్ల పాపం ఇటువంటి పద్ధతికి అలవాటు పడింది కాదల్లే ఉంది—బాగా సిగ్గు పడింది. ప్రసాదరావు నాగరికతమీద మాకు గౌరవం కలిగినా—ఆ పిల్ల సిగ్గు చూసేప్పటికి బాధ వేసింది.

టీ తీసుకున్న తరువాత కొంచెం సేపు కులాసాగా కబుర్లు చెప్పు కున్నాం. ఎందుకో దాసు మటుకు ప్రసాదరావుతో అంత చనువుగా వుండటం లేదు. నన్నూ, కృష్ణమూర్తినీ చూసే అతను ప్రసాదరావు ఇంటికి వొచ్చినట్టుగా అగపడుతోంది. ఆ ఇంట్లోంచి బయట పడ్డాక, కృష్ణ మూర్తి ఇంటికి వెళ్ళాక, నాతోపాటు రూమ్‌కు వొచ్చిన దాసును సావ కాశంగా అడిగాను:

'ఏం! ప్రసాదరావు ఇంటో అంత ముభావంగా ఉన్నావెందుకు?'

'ఆ దుర్మార్గుడితో నువ్వెట్లా స్నేహం చేస్తున్నావో గాని...'

దుర్మార్గుడా ? ప్రసాదరావు దుర్మార్గుడా? వాసు ధోరణి నాకు అర్థం కాలేదు.

'ఎమిట్రా అట్లా అంటావు?' అన్నాను ఆశ్చర్యంగా.

'వాడి గత చరిత్ర మీ కెవ్వరికీ తెలీదు.'

'నీ కెట్లా తెలుసు?'

'నాకా! వాళ్ళ ఊరివాడే ఇక్కడ ఒకడు ఉద్యోగం చేస్తున్నాడు. వాడి పుట్టు పూర్వోత్తరాలు, వాడు చేసిన ఘోరాలు నాకు సవిస్తరంగా చెప్పాడు.'

'ప్రసాదరావు మంచివాడు కాదా?'

'కాదు. వాడికి నీతిలేదు. వాడికి న్యాయం లేదు. వాడి దృష్టిలో స్త్రీ బజార్లో డబ్బుపెట్టి కొనుక్కొచ్చే ఒక వస్తువు. ఆ వస్తువు యొక్క ఉపయోగాన్ని మనం అనుభవించాక ఆ వస్తువును మనం పారవేస్తాం. అట్లాగే వీడు క్రితం సంవత్సరం ఒక యువతిని ప్రేమించినట్టు ప్రేమించి, మాయమాటలు చెప్పి, ఆమెను వలలో వేసికొని, లేవదీసికొనివచ్చి, ఆమెకు గర్భం తెప్పించి,చివరకు ఆమెను 'విధి'కి వొదిలేసి, తాను తప్పుకొని

వొచ్చాడట. ఈ మధ్యనే పదివేల రూపాయల కట్నంతో వైభవంగా పెళ్లి చేసుకున్నాడు.'

'ఆమె గతి ఏమైంది?'

'గోదావరి పాలైంది!'

'ఆఁ! గోదావరిలో పడిందా?'

'ఏమో! ఎవరు చూశారు?'

ఆ క్షణాన నా మనస్సులో రాజ్యలక్ష్మి మెరిసింది. రాజ్యలక్ష్మిని ప్రేమించిన ప్రసాదరావు ఇతడే కాదుగదా!

'ఆమె పేరు తెలుసా?'

'పేరా! బందరు అమ్మాయట. పేరు...ఆమె విధవట...రాజ్య లక్ష్మిట!'

రాజ్యలక్ష్మి!

నా హృదయపు మూలమట్టం విరిగింది. నాలో హఠాత్తుగా కలిగిన మార్పుకు దాసు ఆశ్చర్య పోయినట్టున్నాడు; నావంక గాభరాగా చూశాడు.

'ఏమిట్రా? రాజ్యలక్ష్మి మీకేమన్నా బంధువా?'

............

'మాట్లాడవేం?'

విషాదంనుండి మూర్ఛ నుండి తేరుకొని రాజ్యలక్ష్మి-ప్రసాదరావుల కలయికలో నాకుగల పాత్రను వివరంగా చెప్పాను. దాసు సానుభూతి తెలిపాడు.

ప్రసాదరావు ఎంత నీచుడు? సంఘానికి వేరు పురుగు! సంస్కార వంతుడూ, కార్యదీక్షా పరుడూ అని నేను పొగిడింది-ఈ దుష్టుడైన ప్రసాద రావు నేనా?

పాపం...రాజ్యలక్ష్మి! ఎక్కడ ఉందో! ఎన్ని కష్టాలు పడు తూందో...

'తల్లి బావిలో దూకినా-

'తండ్రి కరెంటుతీగ పట్టుకున్నా-

'బంధువులు ముక్కుమీద వ్రేళ్లు వేసుకున్నా- లోకం కళ్లువిప్పి నోరు తెరిచినా-

'నేను నిన్ను వివాహం మాడతాను రాజ్యలక్ష్మీ!' అని వాగ్దానం చేసి, ఆమెను ఇంటి దగ్గర్నుంచి లేవదీసికొని వెళ్ళి, చివరకు ఆమెను 'విధి'కి వొదిలేసి-పిరికి వాడిలా, దుర్మార్గుడిలా, చవట దద్దమ్మలా పారి పోతాడా? ఎంత నీచం? ఎంత హీనం? ఏం బ్రతుకు? అమాయక హృదయంలో ప్రేమను రగుల్కొల్పి, మోహాన్ని రేపి, విధవరాలైన ఆమెకు అరిచేతిలో స్వర్గాన్ని చూపి-గర్భం ధరించాక పరిస్థితులకు భయపడి-ఆమెను వొదిలి వెళతాడా?

పెద్ద కట్నంతో పెళ్ళి చేసుకున్నాడట ప్రసాదరావు. ఆ ముఖానికి సిగ్గు ఎట్లా లేకపోయిందో! అతనిది హృదయమో-లేక పాషాణమో! సంస్కారం, ప్రేమ, పెళ్లి-అనే పేర్లతో అమాయక స్త్రీల జీవితాల్లో ప్రవేశించి, వాళ్ళను మభ్యపెట్టి, స్వార్థం చేతిలో కీలుబొమ్మలై, సంఘంలో పైస్థానం పొందాలని ప్రాకులాడే యీ పనికి మాలిన వెధవాయిగాళ్ళను ఏం చేయాలి? ఏం చేస్తే పాపం ఉంది! చదువుకున్నవాడూ, ప్రపంచజ్ఞానం కలవాడూ,-ఒక స్త్రీని మోసంచేసి, జీవితాంతమూ ఆమె భవిష్యత్తుమీద నల్ల ని గుడ్డ కప్పటంలో-అతనికి స్త్రీ హృదయం మీద, స్త్రీ పరువు ప్రతిష్టలమీద, స్త్రీ జన్మమీద కించిత్తు కూడా దయ లేక పోయిందా?

పాపం...రాజ్యలక్ష్మి.

మగవాడ్ని మనస్ఫూర్తిగా నమ్ముకున్న రాజ్యలక్ష్మి.

జీవితాన్నీ, బ్రతుకులోని విలువనూ,-సర్వస్వాన్నీ అర్పించిన రాజ్యలక్ష్మి.

-గతి చివరకు ఎట్లా అయింది?

ఏ చెట్టు చాటునో, ఏ రోడ్డు ప్రక్కనో, ఏ వంతెన క్రిందనో, ఏ అరుగు నీడనో-ఒక జీవాన్ని యీ భారత దేశపు గడ్డమీదకు దిగుమతి చేస్తుంది. వాడికి తండ్రి ఎవరు? వాడికి పోషణ ఎట్లా? గాలిలో పుట్టాడు-గాలిలోనే పెరుగుతాడు! రాజ్యలక్ష్మి బ్రతుకు ఎలా తెల్లవారుతుంది? ఎట్లా రోజులను గడుపుతుంది?

ఆమె బ్రతుకును-క్రొసురోడ్లమీద ఏర్పరచుకున్న భవిష్యత్తును-నేను ఊహించలేను.

కాని రాజ్యలక్ష్మికి పట్టిన యీ దుర్గతికి, యీ దారిద్ర్యానికి కారణం ఎవరు?

ప్రసాదరావు!

నేనెందుకు కాకూడదు?

ఆ సాయంత్రం నేను ఆ లేఖను రాజ్యలక్ష్మికి అందజేయక పోతే- రాజ్యలక్ష్మి బ్రతుకు ఇంత అధ్వాన్నం అయేది కాదుగదా! సహం నేనే రాజ్యలక్ష్మి అధః పతనానికి కారణం! నేను కవరు ఆ సాయంత్రం అంద జేయకండా వుంటే-ఇంట్లోనే అంట్లు తోముతోనో, వంట జేస్తోనో వుండేది! ఏం? ఆ జీవితం మంచిది కాదూ? ఇట్లా ఆకలితో దరిద్రంతో మాడుతూ, చినిగిన గుడ్డలతో కృంగిపోతూ, వ్యక్తిలోని నీతిని చెప్పక ప్రపంచానికి చాటే కడుపుతో, లోకపు కంటి ఎరుపు యొక్క తీవ్రతను భరిస్తూ-అధమాధమపు బజారు బ్రతుకు బతికే కంటే, సాధ్యమైనంత వరకూ కోర్కెల్ని అణచుకొంటూ, వంటగదే పరమావధిగా యెంచు కొంటూ జీవితాన్ని గడపటం నయంకాదూ!

నేనే రాజ్యలక్ష్మి బ్రతుకును పాడుచేశాను. నేనే ఆ నరరూప రాక్షసుడికి, ఆ గోముఖ వ్యాఘ్రానికి, ఆ రాతిగుండెకు-రాజ్యలక్ష్మిని అప్ప గించాను. ఆ లేఖలోని తియ్యటి మాటలకు మోసపోయాను. రాజ్యలక్ష్మి విధవ జీవితానికి స్వస్తి కలుగుతూంది కదా అని సంతోషించాను. కాని కథ అడ్డం తిరిగింది. నమ్మకున్నవాడి స్వార్థానికి, అవినీతికి, నిర్దయకు, పశుత్వానికి బలియైంది.

రాజ్య లక్ష్మి!

నేనే నిన్ను బురదలోకి త్రోశానా? నేనే నీకు అపచారం చేశానా? ఏం చేసేది?

## 3

రాజ్య లక్ష్మి ఏమైంది?

ఆత్మహత్య చేసుకుందా?

—జీవిస్తోనే ఉందా?

ఎవరు చూశారు? ఆమెను గురించి ఎవరికి పట్టింది? నేను మట్టుకు ఆమెను ఎట్లా వెతకటం? ఆమె ఎట్లా ఉంటుందోకూడా నాకు తెలియదే!

ఒక రోజు సాయంత్రం ప్రసాదరావును రూముకు పిలిపించి అడిగాను.

'బందరు రామానాయుడి పేటలోని రాజ్యలక్ష్మి ఇప్పుడు ఎక్కడ ఉంది?'

కలవరపడి నావంక పిచ్చిగా చూశాడు ప్రసాదరావు.

'రాజ్యలక్ష్మి - నీ కెట్లా తెలుసు?'

'ఎట్లానో తెలుసులే! ఆమె ఇప్పుడు ఎక్కడ ఉంది?'

ప్రసాదరావు మాట్లాడలేదు. ఏం మాట్లాడతాడు? తను ఆడదాన్ని చేసిన అన్యాయాన్నీ, అక్రమాన్నీ మరొక పురుషుడు ఎత్తిచూపుతోంటే- ఏం మాట్లాడతాడు?

'ఆమె ఏమైందో నీకు తెలీదా!' అన్నాను గంభీరంగా.

'ఆమె ఏమైనా నాకు ఆలోచనలేదు' అన్నాడు ప్రసాదరావు.

నాకు ముఖంమీద ఛెళ్లున కొట్టినట్లయింది. రాజ్యలక్ష్మి మీద అంత వెగటు అతని కెందుకు వేసిందో అర్థం కాలేదు.

'ఆమె నీకుచేసిన ద్రోహ మేమిటి?' కఠినంగా ప్రశ్నించాను.

...............

'నిన్ను మానవుడ్నిగా నమ్ముకొని, నీ వెంట లేచిరావటమేనా?'

..................

'నీ వలలోబడి, సర్వస్వాన్నీ నీకు అర్పించడమేనా?'

..................

'జీవితంలో వెలుగును కల్పిస్తాననే నీమాటల్ని విశ్వసించి, నీ కామానికి బలిమై, తన బ్రతుకుమీద నల్లని గుడ్డని కప్పుకోవటమేనా?'

ఇక ప్రసాదరావు ఒక్కక్షణం అక్కడ కూర్చోలేదు. నామాటలు సూటిగా అతని గుండెకు తాకినై. నామాటలు వింటూన్న అతని ముఖం ఎర్రనైంది; అతని పెదాలు కదిలాడినై; ముఖం వొణికింది—నా మీద కోపం చేతకాబోలు; ఏమీ అనలేక, చేసిన దుర్మార్గాన్ని వొప్పుకోలేక, పిరికివాడై, నా రూమునుంచి పారిపోయాడు. మళ్ళీ అతను నా రూముకు వస్తాడనీ, నాతో మాట్లాడతాడనీ నేను తలచను.

ప్రసాదరావు రాజ్యలక్ష్మిని ఎందుకు మోసం చేశాడు? ఆ ప్రశ్నకు ప్రతివాడూ సమాధానాన్ని సులభంగా వెతుక్కోవొచ్చు. పైగా అతను

'ఆమె ఏమైనా నాకు ఆలోచనలేదు' అనడంలో, ఆమెమీద ఏదో నేరాన్ని మోప ప్రయత్నించడంలో - అతని హృదయంలోని కల్మషమే వ్యక్తీకరించ బడుతూన్నది కానీ అతని నిర్దోషిత్వం కాదు. రాజ్యలక్ష్మిని మోసంచేసి నందుకు ఆమెను గురించి ప్రశ్నించినవాళ్ళకు అనేకరకాలుగా సమాధానాలు చెప్పివుంటాడు. పిరికిపంద!

రాజ్యలక్ష్మి ఏమైంది?

ఏమవుతుంది?

అదే నా హృదయంలో మాటిమాటికీ తలఎత్తే ప్రశ్న! ఆమెను కన్నవాళ్ళకూ, ఆమెతో సంబంధం ఏర్పరచుకొన్నవాళ్ళకూ, ఆమె క్షేమాన్ని (?) కోరేవాళ్ళకూ లేని ఆదుర్దా నాకెందుకు? అనుకుంటాను అప్పుడప్పుడూ. కాని గా మనస్సు మరుక్షణమే తిరుగబడుతుంది. 'నా జీవితంతో నువ్వు జోక్యం కలిగించుకోవూ!' అని ఆమె నన్ను అడగలేదు. అసలు ఆమెకు నేనెవరో తెలీదు. నాకు మట్టుకు ఆమెపేరు తెలుసు కాని మనిషి తెలీదుగా! అయినా ఆమె బ్రతుకు కథలోకి నేను అవ్యక్తంగా లాగబడ్డాను. ఆమెకు ఏదో సహాయం చేసినట్టు, ఆమె జీవితం వెన్నెల కావటానికి తోడ్పడ్డట్టూ - సంతోషించాను. కాని ఆమె నిజమైన చరిత్ర విన్నాక నా సహాయం ఆమె బ్రతుకులో ఎటువంటి అధోగతిని సృష్టించిందో అర్థమై, ఆమెమీద సానుభూతి ఎక్కువ కాసాగింది.

రాజ్యలక్ష్మి ఇంటికి వెళ్ళిందేమో!

ఇంటికి వెళ్ళటమే! ఆమె అంత సాహసం చేయగలుగుతుందా? దైనిక జీవితంలోని దారిద్ర్యాన్నీ, న్యూనతనూ భరించలేక ఒకవేళ ఆమె సాహసంచేసినా - ఇంట్లోవాళ్ళు గడప తొక్కనిస్తారా? కన్నకూతుర్నే కాదంటారా? 'నీతి' 'అవినీతి' 'మంచీ' 'చెడూ' - ఇవన్నీ ఒక్కొక్కప్పుడు రక్త సంబంధం తాలూకు బాంధవ్యం ముందు పని చెయ్యవు. తల్లిదండ్రులే ఆమెను లోకానికి దడిచి గడప తొక్కనివ్వక పోతే - ఆమెకు ఆత్మహత్యే శరణ్యం! అటువంటి స్థితిలో ఉన్న స్త్రీకి ముందుమార్గం కూడా అదే అగపడుతుంది.

కాని రాజ్యలక్ష్మి ఆత్మహత్య చేసికొన్నట్టు ఎక్కడా ఆచూకీలేదు. ఆమె ఎక్కడో ఒకచోట జీవిస్తూనే ఉండాలి......

చాల రాత్రివరకూ ఆలోచిస్తో మేల్కొన్నాను. ఆమెనుగురించి ఉన్న ఆలోచనలతో అలిసి నిద్రపోయాను నాకు తెలీకుండానే.

నిద్రలో కల!

కలలో రాజ్యలక్ష్మి. నాకు ఎట్లా తెలుసు? ఆమె చెప్తోకుంది తనే రాజ్యలక్ష్మి అయినట్టు.

అర్ధరాత్రి. బయట గాలీ, వానా! అప్పుడప్పుడూ ఉరుములూ, మెరుపులూ! గదిలో ఒకడ్నే కూర్చుని కథ వ్రాసుకుంటున్నాను. ఆ కథ రాజ్యలక్ష్మిని గురించే...

అర్ధరాత్రి నా గదిబయట ఏదో చప్పుడైంది. తలుపు తెరిచాను. ఒక స్త్రీ సామాన్య దుస్తులతో సహజమైన సౌందర్యంతో ఒప్పుతూన్న ఒక యువతి.

ఎవరు?

'రాజ్యలక్ష్మిని'

రాజ్యలక్ష్మి?

ఆమెవంక తేరిపార జూచాను. ఆమె నాగదిలోకి వొచ్చింది. బయట వాన, గాలీ తీవ్రమైంది. కిటికీలోంచి జల్లు తోసుకు వొస్తోంది. రాజ్యలక్ష్మి కుర్చీలో కూర్చుంది. నేను వ్రాస్తూన్న కథ తాలూకు కాగితాలు ఆమె ముందున్న డ్రాయరుమీదే ఉన్నాయి. నా గుండెలో టపం టపటప మంటోంది.

'నాగురించి మీరు బాధ పడుతున్నారు. నా అభాగ్య చరిత్రను లోకం కళ్ళముందు పెట్టేందుకు శ్రమ పడుతున్నారు...' అన్నది రాజ్యలక్ష్మి.

'నేను చస్తే, నాకోసం చెమ్మగిల్లే నయనాలు లేవు - మీవితప్ప. అందుకోసమే ఆఖరి క్షణాల్లో మీ దర్శనం చేసికొని వెళదామని వొచ్చాను.'

ఆమెధోరణి నాకు అర్ధం కాలేదు. 'ఆఖరి క్షణాలు' అంటోంది!

'ప్రసాదరావు నన్ను మోసంచేశాడని నేను ఎందుకు అనుకోవాలి! అతన్ని నమ్మిన నా యొక్క దౌర్బల్యమే - ఇంతకూ కారణం! మగవాడికి సర్వస్వాన్నీ అర్పించడంలో స్త్రీ గమనించాల్సిన జాగ్రత్తలను నేను గమనించలేదు. కాలు జారాను. బురదలో పడ్డాను...ఆ బురదలోంచి

బ్రతుకటికి రాలేక, ఆ బురదను చూసి నవ్వే లోకంయొక్క తెలుపును చూడలేక, ఆత్మహత్య చేసికొనేందుకు తలపడ్డాను.'

'ఆత్మ హత్యా!'

'అవును. ఈ బ్రతుకు ఇంతకంటె ఉదాత్తమైన మార్గం మరొకటి ఉంటుందా?' ఆమె కుర్చీలోంచి లేచింది.

ఆత్మహత్య చేసికోబోతోంది రాజ్యలక్ష్మి. అర్ధరాత్రి. గాలివాన. ఆత్మహత్య ..రాజ్యలక్ష్మి...నా సమక్షంలోనే ఆమె మాట్లాడుతూంది!

రాజ్యలక్ష్మి బయలుదేరింది.

'వొస్తాను. గాలికి అదాటుగావొచ్చిపడ్డ గడ్డిపోచలాంటి దాన్ని. నన్ను గుర్తించుకోబోకండి...'

ఆత్మహత్యకు పాల్పడే స్త్రీని రక్షించడం ధర్మంకాదూ! అందులో రాజ్యలక్ష్మి-

రాజ్యలక్ష్మి మార్గానికి అడ్డుగా నిలుచున్నాను.

'మీరు ఆత్మహత్య చేసుకుంటే - నన్నూ హత్యచేసినట్టే!' అన్నాను గంభీరంగా.

'ఆఁ...' రాజ్యలక్ష్మి త్రుళ్ళిపడింది.

బయట వానలో బ్రహ్మాండంగా ఒక్క మెరుపు మెరిసింది.

'సంఘానికి దడిచి, భవిష్యత్తుకు భయపడి, జరిగిపోయిన తప్పిదానికి కుమిలిపోయి-జీవితాన్నే సహారా ఎడారిలో చీకటిలాగా భావించుకొన్న నిన్ను, మనస్ఫూర్తిగా నేను వివాహమాడతాను.'

రాజ్యలక్ష్మి వికటంగా నవ్వింది. ఆ నవ్వుకు రూము ప్రతిధ్వనించింది.

'నన్నా? వివాహమా?'

'అవును. నువ్వు గర్భవతివైనా నాకు పుట్టింపులేదు. నీ గత జీవితంతో నాకు నిమిత్తం లేదు.' అన్నాను నిశ్చయంగా.

ఆమె నావంక చూసి నవ్వుతోనే ఉంది పెద్దగా. ఆమె అట్లా నవ్వుతో వుండగానే కల కాస్తా తెగిపోయింది...

తర్వాత రాజ్యలక్ష్మి ఏమైందో నాకు తెలీదు. ఆమె రూపాన్ని గుర్తుంచుకొనేందుకు ప్రయత్నించాను. ఆమె సన్నగావుంటుంది, ముఖం పొంగగా వుంటుంది. కళ్ళు చారడేసి, ముక్కు...జ్ఞాపకం లేదు.

ఆకల నాలో ఒకవిధమైన నూతన సంస్కారానికి అంకురార్పణ వేసింది. ఆ రోజంతా ఆలోచించాను.

రాజ్యలక్ష్మి బ్రతికివుంటే తప్పకుండా పెళ్ళిచేసుకోవాలి!

ఆ నిశ్చయం నాలో గాఢంగా నాటుకు పోయింది. ఆరోజునుంచీ రాజ్యలక్ష్మి మీద ప్రేమ కలుగ నారంభించింది. రాజ్యలక్ష్మి బ్రతికి వుంటే, ఆమెను నేను కలుసుకో గలిగితే - ఆమెను తప్పకుండా పెళ్ళాడతాను. ఆమె అవినీతి, ఆమె ఒంటరితనము, ఆమెపట్ల సంఘానికి ఉన్న అసహ్యమూ - నేను గమనించను.

నేను రాజ్యలక్ష్మిని పెళ్ళిచేసికొనేందుకు ఇంట్లో వాళ్ళకు కానీ, బయటివాళ్లకు కానీ దడిచేది లేదు. స్నేహితులు గేలిచేసినా, తల్లిదండ్రులు మొత్తుకున్నా, బంధువులు మూతులు తిప్పినా, లోకం ఆక్షేపించినా— నేను రాజ్యలక్ష్మిని వివాహ మాడతాను. ఆమె పిల్లనో,పిల్లవాడ్నో కన్నా ఫరవాలేదు.

రాజ్యలక్ష్మి హృదయం మంచిది.

రాజ్యలక్ష్మికి నేను ఇంతకంటే జీవితంలో ఉపకారం చేయలేనేమో—

రాజ్యలక్ష్మికి ఎప్పటికైనా నాభార్య.

## 4

రోజులూ, వారాలూ, నెలలూ గడుస్తున్నవి. రాజ్యలక్ష్మి నాకంట పడలేదు. ఎట్లా పడుతుంది! ఆమెను నేను ఎట్లా గుర్తించను? కలలో కనిపించినట్లు ఆమె సన్నగా, ముఖం సోగగా, కళ్లు పెద్దవిగావుంటాయా? ఏమో! ఆమె అసలు బ్రతికి ఉందో- లేదో! బ్రతికి వుంటే నాకు తటస్థ పడుతుందో లేదో—అనే అభిప్రాయానికి గురికా నారంభించాను.

ఆ సాయంత్రం ప్రసాదరావు నా రూమ్‌కు వొచ్చాడు. అతను నాకు అగపడి చాల కాలమైంది. ప్రసాదరావు చాల బలహీనంగా ఉన్నాడు. జబ్బు పడ్డాడేమో! ముఖం పీక్కుపోయి, జుత్తు రేగి, కళ్ళల్లో ఏదో అశాంతి, హృదయంలో ఏదో బాధ—అతని వాలకం నాకు మొదట ఆశ్చర్యాన్ని కలిగించింది. కాని ప్రసాదరావు మీద నాకు జాలిలేదు; ప్రసాదరావుమీద నాకు అభిమానం లేదు. ఒక స్త్రీ హృదయంలో వలపు

కేసి, వసంతగానం చేస్తానని మాట ఇచ్చి, మోసంచేసి ఆమె జీవితాన్ని నాశనం చేసిన తులువ అతను. ప్రసాదరావు మనస్తత్వంలోని కుళ్ళును నేను ఎప్పుడూ ద్వేషిస్తాను. అతను రాజ్యలక్ష్మికిచేసిన ద్రోహం నాలో ఎప్పుడూ కోపాన్ని రగుల్చుతూ వుంటుంది. ప్రసాదరావు నాతో మాట్లాడి, నా దగ్గరకొచ్చి ఎన్నాళ్లో అయింది.

'ఏమిటి విశేషాలు?' అన్నాను ఎలాగో.

అతను మెల్లగా ముఖం ఎత్తి నావంక అదోరకంగా చూసాడు. ఆ చూపు వెనుక దాగిఉన్న అగాధమైన విషాదం నాకు స్పష్టంగా గోచరించింది కానీ, ఆ అగాధమైన విషాదానికి హేతువు మటుకు బోధపడలేదు.

'మనిషివి అట్లా ఉన్నావేం? జబ్బా!'

'ఊహుఁ!' తల ఆడించాడు.

'మనోవ్యాధా?'

అతని తల ఎటూ ఆడలేదు. గ్రహించాను. అతను ఏదో ఒక విషయంతో బాధపడుతున్నాడు. పరిష్కారంకోసం నాదగ్గరకు వొచ్చి వుంటాడు.

'రానురాను ఆడజాతి ఎంత క్రిందికి దిగజారుతోంది నీతి విషయంలో' అన్నాడు ప్రసాదరావు అతిమెల్లిగా. స్త్రీ జాతిమీద ఏర్పరచుకొన్న అతని ద్వేషానికి, సినిసిజానికి, అసహ్యతకూ వెనుక ఏదో సంఘటన జరిగివుంటుందని వూహించాను.

'ఏం? నీ మాటల్లోని తీపికి లొంగటం లేదా?' అన్నాను.

'పాతివ్రత్యం మరీ మంటగలిసి పోతూంది.'

'కొంపదీసి నీ భార్య - ఎవడితోనైనా లేచిపోయిందా?' అన్నాను సహం హాస్యంగా, సహం కసిగా.

ప్రసాదరావు నావంక తీక్షణంగా చూశాడు. తరువాత అతనే మెత్తబడ్డాడు. మళ్లీ అతనిముఖంలో నల్లనెత్తురు కూడుకున్నది. మూసుకుపోయిన పగలులాగ అతని ముఖంమీద విషాదం కమ్ముకురది.

'—లేచిపోయినా బాగుండేది!' అన్నాడు ప్రసాదరావు ఏడ్వటానికి సిద్ధమై.

నాలో ఆనందం గంతులేయ నారంభించింది. అతను నిజంగా ఏడ్చినా నాలో సంతోషం రవ్వంత వెనుకాడదు.

'ఏం చేసిందేమిటి?' అన్నాను ఆదుర్దాగా అసలు విషయాన్ని బయటకు లాగాలని.

'పిల్లవాడ్ని కన్నది'

'ఓస్. ఇంతేనా? మరినువ్వు ఆమెను పెళ్లి చేసుకుంది పిల్లల్ని కనిపించడానికి కాదా?' అన్నాను పిల్లవాడ్ని కనడంతో భార్యమీద ఏర్పడ్డ ద్వేషాన్ని అర్థం చేసుకోలేక.

'నాకు పెళ్లిజరిగి ఎన్నాళ్లు అయింది?'

'ఏమో—'

'ఆరు నెలలు'

'ఆఁ!'

'అవును. ఖచ్చితంగా ఆరునెలలే! నేను ఆమెను పెళ్లిచేసుకోబోయేప్పటికి ఆమెకు మూడో నెలట!'

నేను రెండు చెవులూ గట్టిగా మూసుకొని 'పాపం శమించుగాక' అన్నాను.

ప్రసాదరావు నిజంగానే ఏడ్చాడు.

'మరి అటువంటి దాన్ని ఎందుకు పెళ్లిచేసుకున్నావ్?' అన్నాను.

'నాకేం తెలుసు యీ తెరవెనక భాగవతం! పెద్దకట్నం యిస్తున్నారు గదా అని ఆశపడ్డాను...'

'పెద్దకట్నంతో పాటు - ఒక పిల్లవాడ్ని కూడా తెచ్చిందన్నమాట' నాకు నవ్వు ఆగలేదు. కాని ఆపుకున్నాను. మనస్సులో నవ్వుకున్నాను.

కొంతసేపటి తరువాత అతను అన్నాడు-

'నాకు తగినశాస్తి జరిగింది. నేను రాజ్యలక్ష్మికి ఎట్లా ద్రోహం చేశానో, నాకు భార్యగా వొచ్చిన స్త్రీకూడా అటువంటి ద్రోహాన్నే నాకు దిగుమతి చేసింది. నేను దుర్మార్గుడ్ని సుబ్బారావ్! నన్ను మనసారా ప్రేమించి, సర్వస్వాన్నీ అర్పించిన రాజ్యలక్ష్మిని, నాకోసం తల్లి దండ్రుల్నీ, జన్మస్థలాన్నీ వొదిలివొచ్చిన రాజ్యలక్ష్మిని, నన్నే జీవితా

భాగస్వామిగా యెంచుకొన్న రాజ్యలక్ష్మిని—మోసంచేసి, పిరికివాడినై, స్వార్థపరుడనై పారిపోయి వొచ్చాను. నేను చేసిన రాక్షసకృత్యానికి, నేను చేసిన అవినీతి కార్యానికి, స్త్రీమీద నాకుగల నీచపు భావానికి విధి నన్ను ఎట్లా శిక్షిస్తే యేం? రాజ్యలక్ష్మి ఎక్కడఉందో, ఎట్లా జీవిస్తోందో...'

నా హృదయం వర్షించే మేఘం చంద మైంది. ప్రసాదరావు పడే పశ్చాత్తాపం అతను భార్యవల్ల మోసపోయిన తీరూ తాత్కాలికంగా అతనిమీద జాలిని కలిగించాయి.

మానవ జీవితం తప్పుల తడికె లాంటిది. తప్పులు చేయడం ఎట్లా సహజమో సరిదిద్దుకోవటంకూడా అట్లా సహజమే మానవునికి. కాని ప్రసాదరావు చేసింది సరిదిద్ద వీలులేని తప్పు. అయినా తప్పు తెలుసుకొని పశ్చాత్తాప పడుతున్నాడు. పశ్చాత్తాపం వల్ల ఆత్మసంతృప్తి మిగలవలసిందే కాని పోయిన పరువు తిరిగిరాదు.

ప్రసాదరావు నన్ను సలహా అడిగాడు,

'ఆమెను ఏం చేయమంటావు? ఎవరికో పుట్టిన పిల్లవాడ్ని నా కొడుకుగా భావించి ఎట్లా తృప్తి పడేది! నీ సలహా ఏమిటి?'

నేను ఏమని సలహా ఇచ్చేది? ఆమెను ఇంట్లోంచి జుట్టుపట్టుకొని బయటికి యీడ్వమనేదా? ఆ పిల్లవాడి గొంతులో రహస్యంగా వడ్లగింజ వేయమనేదా? ఏమని సలహా ఇవ్వటం? ఏ పద్ధతి అవలంబించటంవల్ల ప్రసాదరావు పరువూ-మర్యాద దక్కుతాయి? ఏ పద్ధతి అవలంబించటం వల్ల ప్రసాదరావు అవినీతిని అరికట్టిన వాడు అవుతాడు? ఆమెను ఇంట్లోంచి వెళ్ళగొడితే అవినీతి ఎట్లా అరికట్టబడుతుంది-అది దుర్మార్గం కాదూ! ఆ పిల్లవాడి గొంతులో వడ్ల గింజవేస్తే అవినీతి ఎట్లా రూపుమాసిపోతుంది? అది పాపం కాదూ! ప్రసాదరావు నీతి గలవాడా? పరువూ, మర్యాద కలవాడా? అది అతను ఆలోచించలేదు. తన నిజ స్వరూపాన్ని గమనించకుండా లోకం ముందు నిర్మలంగా వుందామని ప్రయత్నించటం, వృధా ప్రయాసకులోను గావటం—ప్రతి మానవునికీ అలవాటేగా!

## 5

నేను కొన్ని రోజుల సెలవుమీద మా ఊరు వొచ్చాను-ఆస్తి విషయంలో కొన్ని వ్యవహారాల్ని చక్కబెట్టుకోవాల్సిన అగత్యం ఏర్పడి.

ఒక వ్యక్తి కోసం విజయవాడంతా ఉదయం ఏడుగంటల మొదలు సాయంత్రం నాలుగు గంటలు వరకూ అన్వేషణ జరిపాను. అతను అగు పించలేదు. అతనితో పని ఉంది. అతనిది మా వూరి ప్రక్కవూరే. చిన్ననాటి స్నేహితుడు. ఇంటి దగ్గర విచారిస్తే 'విజయవాడ వెళ్లారు. ఎప్పుడొస్తారో-ఏమో!' అన్నారు. విజయవాడలో అతన్ని కలుసుకొనేందుకు ప్రయత్నించాను.

అతను జల్సాగా తిరిగే రకం. హోటళ్ళూ, సినిమా థియేటర్లూ చూశాను. అగుపించలేదు. సాయంత్రం నాలుగు గంటలకు విసిగి వేసారి న్యూ ఇండియా హోటల్లో విశ్రాంతి తీసుకొంటూవుండగా, అతని ఊళ్లో మిత్రుడొకడు హఠాత్తుగా అగుపించాడు. అతన్ని అడిగాను:

'వెంకటేశ్వరరావు ఎక్కడ దొరుకుతాడు?'

'ఏ వెంకటేశ్వరరావు?'

'మీ ఊరి వెంకటేశ్వరరావు.'

'ఎందుకూ?'

'పని ఉంది. అతనితో చక్కబెట్టవలసిన చిన్న వ్యవహారం ఉంది. ఇంటి దగ్గర విచారిస్తే 'విజయవాడ వెళ్ళారు. ఎప్పుడొస్తారో, ఏమో' అన్నారు. విజయవాడే వొచ్చాను. ప్రొద్దుటి నుంచి తిరిగినా అతని జాడే లేదు. నీకేమన్నా తెలుసా అతను ఉండే తావరం?'

అతను కొంచెంసేపు ఆలోచించి—

'పూర్ణానందం పేటలో వుంటాడు.'

'ఏం చేస్తూ వుంటాడు?'

'ఆఁ! అక్కడ వాడికో వేశ్య ఉంది. విజయవాడలో వుంటే-ఇహ దాని దగ్గరే వుంటాడు.'

'చంపావ్! ఫో'

'నువ్వు అక్కడికే వెళ్ళటం మంచిది'

'ఆమె పేరు'

'పేరా!... పేరు నాకు తెలీదు. ఇల్లు మాత్రం తెలుసు.' అతను వెంకటేశ్వరరావు వుండే గుర్తులు చెప్పాడు. ఆ వీధీ, ఆ వీధిలో మఱ్ఱిచెట్టూ, ఆ మఱ్ఱిచెట్టు క్రింద కిల్లీ బడ్డీ, ఆ కిల్లీ బడ్డీకి ఎదురూగ్గా మ్యునిసి

పాలిటీ వారి ఎలక్ట్రిక్ స్తంభమూ, ఆ స్తంభం ప్రక్కన చిన్న డాబా, గుర్తుల ప్రకారం ఆ డాబా దగ్గరకు వెళ్ళాను. కాని లోపలకు వెళ్ళాలంటే తగని సిగ్గూ, భయమున్నూ. ఎప్పుడైనా అటువంటి ఇళ్లకు వెళితేనేగా! ఆ ఇళ్ళకు తరుచూ వెళ్ళే మిత్రులు అప్పుడప్పుడూ ఆ ఇళ్ళల్లో వుండే సౌందర్యమూ, ఆ గదుల్లోని అలంకరణా, ఫోటోలూ, నగ్న చిత్రాలూ, పందిరి మంచాలూ, పట్టు పరుపులూ, నిలువుటద్దాలూ, బ్లూ లైట్లూ, మత్తు కలిగించే పానీయాలూ, పరిమళాలూ-మైసూర్ క్రేప్ సిల్కు చీరెల మెత్తదనంతో, ఉమా గోల్డు కవరింగ్ వాళ్ళ నెక్‌లెస్‌ల మెరుపులతో, గుండెలో మోహాన్ని రేపే నవ్వులతో, కనుసైగలతో, వొళ్ళు విరుపులతో, పైట తొలగింపులతో, అరవిచ్చిన గులాబి పువ్వుల్లాగ వుండే ఆడవాళ్లూ'-వర్ణిస్తూంటే, నిజం చెప్పక పోవటం దేనికి, మనస్సు 'చమక్ చమక్'మంటూ వుంటుంది కానీ,-వెధవది: ఒక్కొక్కప్పుడు ఆ ఇళ్ళకు జాస్తిగా వెళ్ళేవాళ్ళే, ఆ సౌందర్యాన్నంతా అనుభవించిన వాళ్లే-తర్వాత సంప్రాప్తించే భయంకరమైన రోగాల్ని వివరిస్తూంటే, ఈ అనుభవం కలలో కూడా వొద్దురా బాబూ, అని భయపడటం జరుగుతూంది.

రెండుసార్లు ఆ డాబా ముందుగా పచార్లు చేశాను-లోపల వెంకటేశ్వరరావు ఉన్నాడో లేడోనని. కాని నాకు అతను అగుపించలేదు. పడక గదిలో ఏ ప్రణయ దశలోనో వుంటాడు. ఎట్లా అగపడతాడు? అతనితో ఉన్న అగత్యం నన్ను బలవంతాన ఆ డాబాలోకి ప్రవేశ పెట్టింది. ముందు వరండాలో ఎవ్వరూ లేరు. ఎందుకో నా కాళ్ళు జవజవలాడుతున్నాయ్. వెనక్కు తిరిగి బజారు వంక చూశాను: ఎరిగిన వాళ్లు ఎవరైనా నేను వేశ్యాగృహంలోకి ప్రవేశించటాన్ని చూస్తున్నారేమోనన్న భయంతో.

'ఎవరి కోసమండీ!' ఒక సన్నని కంఠం అనడంతో ఉలిక్కిపడ్డంత పనైంది.

'మీ...మీ ఇంట్లో...వెం...వెంకటేశ్వర రావు గారు ఉన్నారా?'

ఆ సన్నని కంఠం నా వంక తేరి పార చూసింది. చిరునవ్వు సన్నగా చిలుకరించింది.

'బజారుకెళ్ళారు. వొచ్చే వేళయింది. కూర్చోండి.' కుర్చీ చూపించింది ఆమె.

నేను సందేహించాను. అది వేశ్యాగృహం. ఆమెతో అనుభవం కోసం ఎందరెందరో వస్తూవుంటారు. నేను కేవలం పూరికనే-కాఫీ త్రాగటానికి డబ్బుల్లేని వాడు, సినిమా రికార్డులు వినేందుకు కాఫీ హోటల్లో కూర్చున్నట్టు కూర్చోవడం ఏం సబబు?

'సందేహిస్తారేం? ఫరవాలేదు. కూర్చోండి' అన్నదామె.

ఏం చేసేది? కూర్చున్నాను ముళ్ళమీద కూర్చున్నట్టు. నాకు కొంచెం ఎడంగాఉన్న ఫేం కుర్చీలో ఆమెకూడా కూర్చుంది.

వెంకటేశ్వరరావు వుంచుకున్నది ఈమెనే కాబోలు! ఎంత అందంగా ఉంది? ఎంత ఫ్యాషన్ గా ఉంది? ఆ తలకట్టూ, పువ్వుల అమరికా, గుండ్రటి కంఠం చుట్టూ ఆ రవ్వల నెక్ లెస్, ధరించిన దుస్తులూ, ఆమె పరిశుభ్రతా, సౌందర్యమూ, అంగసౌష్ఠవమూ, మనిషిలో యాక్టివ్ నెస్-వేశ్యలంతా అట్లా వుంటారు కాబోలు!

'వారి చుట్టాలా?' అన్నదామె నవ్వుతూ.

అంతా తెచ్చిపెట్టుకున్న నవ్వు. మరి ఆ నవ్వులోనే మైమరపించే ముగ్ధత్వం!

'కాదు' అన్నాను ముక్తసరిగా.

'మరి-'

'స్నేహితుడ్ని'

అంతటితో సంభాషణ తెగిపోయింది. కాని నాకెందుకో ఆమెతో ఇంకా మాట్లాడాలనే కుతూహలం కలుగుతోంది. కాని ఏమని మాట్లాడటం? రెండు నిమషాలపాటు ఆ గది నంతటినీ చూపులతో పర్యటించాను. గోడలకు సినిమాతారల ఫొటోలు, క్యాలెండర్లతోపాటు రెండు మూడు దేశనాయకుల ఫొటోలుకూడా ఉన్నాయి. పడమటి వైపు ద్వారానికి అందమైన కర్టెను. ఆ ద్వారం పడక గదికి దారి తీస్తుంది కాబోలనుకున్నాను.

పని మనిషి రెండు కాఫీ కప్పుల్ని తెచ్చి డ్రాయరుమీద పెట్టింది. ఆమె ఒక కప్పు నాకు అందించింది. ఆ మర్యాద నాకు నచ్చింది. కాఫీ త్రాగడం ముగించాక ఆమెతో అన్నాను—

'మీ పేరేమిటండీ!'

'రాజ్యలక్ష్మి'

'ఆఁ! రాజ్యలక్ష్మి'అన్నాను అప్రయత్నంగా. నాలో, నాఆరాధ్య దేవతయైన, నా స్వప్న సుందరియైన ఆ రాజ్యలక్ష్మి పేరు మెరుపులాగ తట్టగా.

నా కలవరపాటుకు రాజ్యలక్ష్మి అదిరి పోయింది. నా వంక అమిత మైన ఆదుర్దాతో చూసింది.

'ఏం అట్లా అన్నారేం? ఆమె ఎవరు?' అన్నది నా ఎదురుగ్గా ఉన్న రాజ్యలక్ష్మి.

నాలో అకస్మాత్తుగా కలిగిన కలవరపాటు ఇంకా సద్దుమణగలేదు. ఆ రాజ్యలక్ష్మి బ్రతుకు కోసం చివరకు ఇట్లా అయిందేమో—ఆమెకేసి చూశాను-కలలో అగుపించిన రూపాన్ని పోల్చుకుందామని. సన్నగా అయితే వుంది కాని ముఖం అంత సోగగా లేదు. ముక్కు అంత పొడ వుగా లేదు. కంఠం అంత గుండ్రంగా లేదు. ప్చ్. ఈమెకాదు. లోకంలో 'రాజ్యలక్ష్మి' అన్న పేరుగల వాళ్లు ఎంతమంది లేరు గనక?

'అట్లా ఉలిక్కిపడ్డారేం? నా గురించి విని ఉన్నారా?'

'ఆఁ!...లేదు, లేదు. ఆ రాజ్యలక్ష్మి వేరు. మీరు కాదు...' అన్నాను.

'ఓహో...ఆమె మిమ్మల్ని మోసగించిందా?' అన్నది రాజ్యలక్ష్మి.

'లేదు. ఆమే మోసపోయింది. ఒక మగవాడ్ని నమ్మి, 'జీవితంలో నిన్ను తప్ప వేరే యువతిని పెళ్ళి చేసుకోను' అన్న మగవాడి ఆనందానికి శరీరాన్ని అర్పించి-గర్భవతియై, చివరకు ఆ మగవాడిచేతనే త్రోసి రాజన బడి, బ్రతుకే ఒక పెద్ద ప్రశ్నగా తయారుకాగా, ఎటో వెళ్లిపోయిన రాజ్యలక్ష్మి ఆమె.'

'ఆమెది ఏ ఊరు?'

'బందరు రామానాయుడి పేటలో ఉండేది. ఆమె విధవ. ప్రసాద రావు అనే యువకుని తుచ్ఛ ప్రేమకు పాపం ఆమె గురైయింది. పసుపూ కుంకుమా చెరిగి పోయిన తన జీవితంలో, మళ్ళీ వెన్నెల కాసే యోగ్యత ఉన్నదని ఆ అమాయకురాలు విశ్వసించింది. ప్రియుడు రమ్మనగానే తల్లి

దండ్రుల్నీ బంధువుల్నీ వొదలి ముందు చూపు లేకుండానే వెళ్ళింది. ఆ ప్రియుడు అనుభవించినన్నాళ్లూ అనుభవించి, రోత జనించగానే-ఆమెను ఒక హోటల్లో విధికి వొదలి, తన దారి తాను చూసుకున్నాడు. తర్వాత పెద్ద కట్నంతో పెళ్ళి చేసుకున్నాడు. ఆమెను మోసం చేసిన పాపం వొట్టినే పోతుందా? ఆ వొచ్చిన భార్యకు పెళ్లినాటికే నెల తప్పింది... హోటల్లో వొదిలిపెట్టబడిన ఆమె జాడ తెలీదు. ఏమైందో! సంఘానికి, బ్రతుక్కూ భయపడి ఆత్మహత్య చేసుకుందో...మరి ఎక్కడేనా, ఎట్లా నైనా జీవిస్తోందో—'

'ఆత్మహత్య చేసుకోవడం అంత సులభమా?'

'కాదనుకోండి. మరి అభిమానంగల ఆడది అటువంటిపరిస్థితుల్లో ఎట్లా లోకానికి తల ఎత్తి చూపిస్తుంది!'

ఆమెకు ఇంకా అభిమానం ఏమిటి? ఆమె చేసిన అవినీతి, పాడు పని లోకానికి తెలియదా? ఆమె లేచిపోయిన రోజే సంఘం ఆమె భవిష్యత్తును నిర్ణయించి వుంటుంది. అదీకాక ఆమె ఆత్మహత్య చేసుకుందామనుకున్నా-కడుపులో మరో ప్రాణం వుందిగా! అటువంటి పరిస్థితుల్లో ఆత్మహత్య మహా పాపం కదూ! ఆమె ఎక్కడో ఒకచోట బ్రతికే వుంటుంది....ఏదో ఒక విధంగా బ్రతుకుతూనే ఉంటుంది. చూడండీ! నీతి చెడిన ఆడవాళ్లు బ్రతికేందుకు దేశంలో ఎన్నిమార్గాలు లేవు? ఎంత మంది ఆ మార్గాల్ని అనుసరించటం లేదు? ఒకసారి గాడితప్పిన ఆడది-మళ్ళీ తన మంచితనం చేత, తన తప్పును సరిదిద్దుకోవటం చేత, పశ్చాత్తాప పడటంచేత సంఘాన్ని-మెప్పించలేదు. ఆ మచ్చ జీవితాంతమూ మచ్చగానే ఉంటుంది. కనుక ఆమె నీతిగల లోకం ముందు నిలబడేందుకు సాహసం చేయలేదు. ఎక్కడో అవినీతిగా, భగవంతు డిచ్చిన సౌందర్యాన్ని అంగడిలో పెట్టి, బ్రతకటం కోసం బ్రతుకుతూ వుంటుంది... అడగడం మరిచాను. మరి ఆమె కథలో మీపాత్ర ఎక్కడ?'

'నా పాత్రయొక్క ప్రవేశం చాల విచిత్రంగా జరిగింది.' అని అప్పుడు ఆ కవరు నారూములో అప్రయత్నంగా వొచ్చిపడిన దగ్గర్నుంచీ-రాజ్యలక్ష్మి మీద నాకు ప్రేమ కలిగి, పెళ్లిచేసుకుందామని గాఢంగా నిర్ణయించుకున్న వరకూ చెప్పాను.

'అంత నీతిలేని దాన్ని మీరు ఎట్లా పెళ్ళి చేసుకుంటారండీ?' అన్నది ఆమె.

'ఆమె నీతిలేనిది ఎందు కవుతుంది? ఆమె ప్రియుడు ఆమెకు నీతిలేని తనాన్ని అంటగట్టాడు కానీ ఆమె అసలు నీతిలేనిదా? కోర్కెల్ని చంపుకుంటూ విధవగా జీవితాన్ని వంటగదిలో వెళ్లమార్చే బదులు-ఆమె పునిస్త్రీగా కావటాన్ని కోరుకోవటంలో అవినీతిఏముంది? తన ప్రియుడ్ని పూర్తిగా నమ్మింది. నిప్పుల్లో దూకమంటే దూకింది. బురదలో మునగమంటే మునిగింది. అదీగాక ఆమె జీవితం ఇంత అధ్వాన్నంగా మారటానికి నా జోక్యం లేదు. ఆ సాయంత్రం నేను కవరు ఆమెకు అందజేయకుండా వుంటే ఆమె రోజులు మారేవేమో? ఆమె నాశనానికి కారణం నేనే! ఆమె అవినీతికి కారణం నేనే!-నేను అనే ఒకడ్ని యీ లోకంలో ఉన్నాననీ, తన అభాగ్య చరిత్ర కంతటికీ మూలం వాడేననీ...ఆమెకు తెలియక పోవచ్చు. ఆమె కోసమే నేను ఎన్నాళ్ళనుంచో బతుకుతున్నాను. ఆమె కనబడితే నా విషయమంతా చెప్పి-'

'ఆమె మిమ్మల్ని పెళ్లి చేసుకుంటుందా? మీ రేమన్నా పవిత్రమైన యువకులు. మీకు సంఘంతో ఎంతో పనిఉంది. మీఉద్యోగం మీకు ఎంతో హోదాని, గౌరవాన్నీ సమకూరుస్తుంది. అటువంటి మీరు ఒక నల్ల బజారు స్త్రీని పెళ్ళాడుతామంటే - ఆమెకుమాత్రం జ్ఞానం ఉండదూ! మిమ్మల్ని పెళ్లిచేసుకోవటంతో మీకు సంఘంలో పరువూ, మర్యాద ఎట్లా జారిపోయేదీ, బంధువుల్లో తల్లి దండ్రుల్లో బాంధవ్యమూ అనురాగమూ ఎట్లా తొలిగిపోయేదీ, సాటీవారిలో, స్నేహితుల్లో గౌరవమూ, అభిమానమూ ఎట్లా సమసిపోయేదీ-ఆ యువతికి మటుకు ఆలోచన వుండదూ!'

'కాని నేను సంఘానికి దడిచే ఘటాన్ని కాదు. నాకు ఒక ఆలోచన ఉంది. ఒక ఆశయం ఉంది. జీవితం ముందుకు నడిచే ఒక సూత్రం ఉంది. నేను వాటినే అనుసరిస్తూ వుంటాను. సంఘమూ, పరువూ, మర్యాదా-నా ఆశయం నెరవేరిన తరువాతనే వాటిని గమనిస్తాను.'

'మీ మనస్తత్వం నాకు చిత్రంగా ఉంది' అని నవ్వింది.

'ఇంకా వెంకటేశ్వరరావు రాలేదే!'

కాశిమ్ వొచ్చాడు. కాశిమ్ వెంకటేశ్వరరావులు కలిసే బజారు కెళ్ళారు.

'ఏరా, అయ్యగారు రాలేదేం!'

'అయ్యగారు ఇంటికి వుడాయించినార్. ఆ సంగతి మీతో చెప్ప మనినార్.'

'ఏం అంత హఠాత్తుగా వెళ్ళారు?'

'నాకేం తెల్సూ! వాళ్లవూరి వాడొకడు అగుపించినాడు. వాడు ఏదో సెప్పినాడు. ఆపర్నే స్టేషన్‌కు దూసుకున్నార్!'

'కర్మ! వొస్తానండీ!' అని కుర్చీలోంచి లేచాను, స్టేషన్లో వాణ్ణి కల్సుకుందామని.

ఆమె నావంక పరీక్షగా చూసింది.

'వెళ్ళి పోతున్నారా?' అన్నది.

'ఊఁ! అతన్ని స్టేషన్లో కలుసుకోవాలి!'

'అప్పుడప్పుడూ వొస్తూవుండండి!'

నవ్వుకున్నాను. వెంకటేశ్వరరావు లాగా తననిగూడా యీ ఇంట్లో, తన సమక్షంలో బంధించుదా మనుకుంటోంది. పిచ్చిది!

నేను సమాధానం చెప్పకుండా బజార్లోకి వొచ్చాను. అప్పటికే బజార్లో దీపాలన్నీ వెలిగాయి. రిక్షాలో ఎక్కి స్టేషనుకు బయలు దేరాను. నాలో ఎన్నో సందేహాలు క్రమంగా బయలు దేరాయి.

—నేను మాట్లాడిన రాజ్యలక్ష్మి బందరు రాజ్యలక్ష్మే నేమో! ఆమె గత చరిత్ర అడగడం మరచిపోయాను! ఆమె నాతో జరిపిన సంభాషణను గుర్తు తెచ్చుకో నారంభించాను...

'ఆత్మహత్య చేసుకోవడం అంత సులభమా?' అన్నది. ఆమె బ్రతికే ఉన్నదన్నమాట—

'అదీ కాక ఆమె ఆత్మహత్య చేసుకుందా మనుకున్నా కడుపులో మరో ప్రాణం వుందిగా!' అవును మరి! అందుచేతనే ఆమె ఆత్మహత్య చేసికొని ఉండదు. మరి ఎక్కడఉంది? ఏమైంది?

'ఆమె ఎక్కడో ఒక చోట బ్రతికే వుంటుంది...ఏదో ఒక విధంగా బ్రతుకుతూనే వుంటుంది. చూడండీ! నీతిచెడిన ఆడవాళ్ళు బ్రతికేందుకు దేశంలో ఎన్నిమార్గాలు లేవు?' అన్నదామె.

అంటే ఆమె వేశ్యగా బ్రతుకుతూన్నదన్న మాట! అంటే .. ఆ రాజ్యలక్ష్మి - ఈ రాజ్యలక్ష్మియేనా! ఆc! నిజమా? రాజ్యలక్ష్మి అంత నీచానికి పాల్పడుతుందా? పరువుగల కుటుంబంలోంచి వొచ్చిన ఆడది...అంత హీనస్థితికి జీవితాన్ని చేరవేస్తుందా?

'ఒకసారి గాడితప్పిన ఆడది...తన మంచితనం చేత, సంఘాన్ని మెప్పించలేదు. ఆ మచ్చ జీవితాంతమూ మచ్చగానే ఉంటుంది. కనుక ఆమె నీతిగల లోకం ముందు నిలబడేందుకు సాహసం చేయలేదు. ఎక్కడో అవినీతిగా, భగవంతుడిచ్చిన సౌందర్యాన్ని'...అంతేనా? రాజ్యలక్ష్మి జీవితంకూడా చివరకు అట్లానే పరిణమించిందా?

ఆ కథలో నా పాత్రనుగురించి ప్రత్యేకంగా అడిగింది. మరి నేను ఆమెకు అంతకుముందు ఎవరో తెలియదుగదా! అందుచేత అంత ఆదుర్దాగా అడిగి వుంటుంది. సందేహం లేదు. ఈ రాజ్యలక్ష్మి ఆ రాజ్యలక్ష్మి.

'అంత నీతి లేనిదాన్ని మీరు ఎట్లా పెళ్ళి చేసుకుంటారండీ?'

'ఆమె మిమ్మల్ని పెళ్ళిచేసుకుంటుందా! మీరేమో పవిత్రమైన యువకులు...ఆ యువతికి మటుకు ఆలోచన ఉండదూ?'

'వెళ్ళి పోతున్నారా?'

'అప్పుడప్పుడూ వొస్తూ వుండండి'

ఆమె నేను వెళుతూంటే ద్వారం వరకూ వచ్చి నా వంక చూసిన చూపు...

ఆమె నిజంగా నా ఆరాధ్య దేవత రాజ్యలక్ష్మి-

'రాజ్యలక్ష్మి!'

రిక్షావాడు ఠక్కున రిక్షా ఆపి నా వంక చూశాడు 'రిక్షా వెనక్కు మళ్ళించరా. ఎక్కిన చోటికే తీసుకు వెళ్లు.'

రిక్షా వెనక్కు తిప్పాడు.

తను ఫలానా రాజ్యలక్ష్మి నేనని నాతో చెప్పుకోవటానికి సిగ్గుపడి వుంటుంది.

వెళ్లి అడుగుతాను-సిగ్గు పడాల్సిన పనిలేదని. ఇన్నాళ్ళకు నా ఆశయం ఫలించింది-ఆమెకు యీ నరకంలోంచి విముక్తిని కలిగిస్తాను. వెళ్లి

చేసుకుంటాను. ఆమె జీవితంలోని అజ్ఞాత వాసాన్ని తొలగించుతాను. ఆమె జీవితాన్ని ఆనందమయం చేస్తాను—

.. అని ఆలోచిస్తో వుండగా రిక్షా రాజ్యలక్ష్మి డాబా ముందు ఆగింది. రిక్షావాడి చేతిలో పావలా బిళ్ల వుంచి గబుక్కున లోపలకు వెళ్లాను ఒక్క గంతులో.

'రాజ్యలక్ష్మి!'

............

'రాజ్యలక్ష్మి!'

డాబా ముందు గదిలో ఎవ్వరూలేరు. కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. కర్టెన్ తొలగించి లోపలకు వెళ్ళాను.

'రాజ్యలక్ష్మి!'

పందిరి మంచం ఖాళీగా ఉంది. పందిరి మంచం ప్రక్కన సోఫా ఖాళీగా ఉంది. ఏమైంది రాజ్యలక్ష్మి?'

ఎక్కడకు వెళ్ళింది?

ఇంట్లో ఎవరూ లేరే!

'ఎవరూ!' అంటూ ఒక యాభై యేళ్ల ముసలమ్మ వొచ్చింది.

'రాజ్యలక్ష్మి లేదూ?"

'ఏమైంది! పడకగదిలో ఉంటుంది'

'లేదు'

'ఎక్కడికి వెళ్ళింది? ఒకవేళ ప్రక్క ఇంట్లోకి వెళ్ళిందేమో!'

కుర్చీలో కూలబడ్డాను.

రాజ్యలక్ష్మి ప్రక్క ఇంట్లో గూడా లేదు.

మరి ఎక్కడకు వెళ్ళింది?

ఆమె కోసం నిరీక్షిస్తూ ఆ కుర్చీలో కూర్చున్నాను.

'సినిమాకు వెళ్ళిందేమో!' అన్నదా ముసలావిడ.

సినిమా వొదిలిపెట్టే వరకూ ఆ కుర్చీలోనే కూర్చున్నాను — ఈ లోపల ఆ ముసలమ్మని అన్ని వివరాలూ అడిగి రాజ్యలక్ష్మి-బందరు రాజ్యలక్ష్మియేనని రూఢి పర్చుకున్నాను. ఆమెకు కలిగిన పిల్లవాడు మసూచికం పోసి చనిపోయాడట.

పది-పన్నెండు గంటలు గడిచినా రాజ్యలక్ష్మి జాడ లేదు.

ఏమైంది ?

నా గుండెలో చీకటి లాంటి భయాలు చెలరేగినై. ఆ రాత్రి నాకు నిద్రలేదు. తెల్లవారింది. ప్రొద్దు పొడిచింది. ఎండ ఎర్రనైంది.

రాజ్యలక్ష్మి ఇంటికి రాలేదు.

గుండెలో మెదిలిన చీకటిలాంటి భయాలు నన్ను పిచ్చివాడ్నిగా చేశాయి. రాజ్యలక్ష్మి ఎక్కడకు వెళ్ళింది ? మళ్ళీ నేను వస్తానని ఆమె ముందుగానే తలచిందా? నాకు ముఖం చూపించవలసి వొస్తుందని...వస్తుందని...ఎక్కడకు వెళ్ళింది ?

ఈ ప్రశ్నకు సమాధానం లభించలేదు. ఒక నెలరోజులపాటు, అక్కడక్కడ విచారించాను. లాభంలేక పోయింది. సెలవు అయిపోవడంతో, ఖర్గపూరు ప్రయాణమైనాను, బరువెక్కిన గుండెతో. ఏమైంది? రాజ్యలక్ష్మి ఏమైంది? తన జీవితాన్ని-ఈ విశాల పృధివిపై గడుపుతున్నదా? లేక అట్టడుగునా?

తారుణ్యంతో పకపక లాడుతున్న నీ జీవితం, శిధిలం కావటానికి, నేనూ కొంత కారణమే రాజ్యలక్ష్మి! నువ్వెక్కడున్నావో ఈదుర్మార్గునికి తెలీదు. ఎక్కడున్నా సరే - నన్నుమాత్రం మన్నిస్తావుకదూ?

